క్లుప్తంగా

రామాలయంలో ప్రత్యేక పూజలు

బాడంగి: స్థానిక కోదండరామాలయంతో పాటు భీమవరం, చినభీమవరం, డొంకినవలస, పూడివలస తదితర గ్రామాల్లో శ్రీరామనవమి ఉత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. తొమ్మిది రోజుల పాటు నిర్వహించే ఈ ఉత్సవాల్లో భాగంగా స్వామివారికి ప్రతిరోజూ ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు అర్చకుడు యడవల్లి శ్రీనివాసశర్మ తెలిపారు. చివరిరోజు స్వామివారి కల్యాణం, పట్టాభిషేకం ఉంటాయన్నారు. అలాగే భక్తులకు అన్నప్రసాద వితరణ నిర్వహించనున్నట్లు చెప్పారు. అదేవిధంగా బాడంగి శ్రీరామ ఆలయంలో నవమి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి.

కొప్పర యువకుడి ప్రతిభ


బౌరోతు అనీల్‌కుమార్

వంగర: మండలంలోని కొప్పర గ్రామానికి చెందిన బౌరోతు అనీల్‌కుమార్ భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్(బెల్)లో జూనియర్ సైంటిస్ట్‌గా ఎంపికయ్యాడు. బౌరోతు మహేశ్వరరావు, సునీత దంపతుల పెద్ద కుమారుడు అనీల్‌కుమార్ ఒకటి నుంచి పదో తరగతి వరకు కొప్పర ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసించాడు. నూజివీడు ట్రిపుల్ ఐటీలో ఇంజినీరింగ్, వరంగల్ ఎన్ఐటీలో ఎంటెక్ పూర్తిచేశాడు. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్(బెల్)లో జూనియర్ సైంటిస్ట్‌గా ఉద్యోగం పొందడంతో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు అభినందనలు తెలియజేశారు.

చురుగ్గా సోషల్ ఆడిట్


వన్నలిలో ఆడిట్ నిర్వహిస్తున్న డీఆర్‌పీ సత్తిరాజు

రేగిడి: మండలంలోని 39 గ్రామ పంచాయతీల్లో 2021–22 ఆర్థిక సంవత్సరంలో చేసిన ఉపాధిపనులపై సోషల్ ఆడిట్ నిర్వహిస్తున్నారు. ఎస్ఆర్‌పీ సీహెచ్.అప్పారావు ఆధ్వర్యంలో మూడు బృందాలు క్షేత్రస్థాయిలో వివరాలు సేకరిస్తున్నారు. ఎవెన్యూ ప్లాంటేషన్, సంక్షేమ పథకాలు, హార్టికల్చర్, ఉపాధిపనులపై ఆరాతీస్తున్నారు. మండలంలో అంబఖండి, సోమరాజుపేట, వన్నలి, ఉప్పర్నాయుడువలస, చాటాయివలస గ్రామాల్లో బుధవారం సోషల్ ఆడిట్ బృందాలు తనిఖీలు చేపట్టారు.

నిత్యావసర సరుకులు అందజేత


నిరుపేదలకు నిత్యావసర సరుకులు అందజేస్తున్న యువకులు

రాజాం సిటీ: మున్సిపాలిటీ పరిధి పొనుగుటివలస గ్రామానికి చెందిన యువత తమ ఔదార్యం చాటుకున్నారు. గ్రామానికి చెందిన పేద కుటుంబాలకు స్థానిక శివరామాంజనేయ యువజన సంఘం సభ్యులు నెలకు సరిపడా నిత్యావసర సరుకులను బుధవారం అందించారు. ఇంటిపెద్ద దిక్కును కోల్పోయిన రెండు కుటుంబాలకు సరుకులు అందజేసినట్లు యువజన సభ్యులు రెడ్డి శ్రీనివాసరావు, బెజ్జిపురపు భాస్కరరావు తెలిపారు.

పాడిరైతులకు దుప్పట్ల పంపిణీ


కోడిశలో పాడిరైతులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న గ్రూప్ లీడర్

రేగిడి: మండలంలో చిన్నకోడిశ, పెద్దకోడిశ గ్రామాల్లో విశాఖ డెయిరీ ఆధ్వర్యంలో పాడిరైతులకు బుధవారం దుప్పట్లు పంపిణీ చేశారు. పాడిపరిశ్రమ అభివృద్ధిలో భాగంగా రైతులను ప్రోత్సహిస్తున్నామని గ్రూప్ లీడర్ మెల్లి సుగుణాకరరావు అన్నారు. సుఖీభవ కార్డు కలిగిన 60 మంది విశాఖ డెయిరీ పరిధిలోని పాడిరైతులకు దుప్పట్లు అందజేశారు.

గాజుల అలంకరణలో చౌడేశ్వరీదేవి


ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తున్న చౌడేశ్వరిదేవి

రాజాం సిటీ: స్థానిక సంతమార్కెట్‌లోని కల్యాణగౌరీ మల్లికార్జునస్వామి ఆలయ ఆవరణలోని చౌడేశ్వరీదేవి గాజుల అలంకరణలో బుధవారం భక్తులకు దర్శనమిచ్చింది. ఆలయ అర్చకులు హరనాథశర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సప్తవర్ణపుష్పాలు, గాజులతో అమ్మవారిని అలంకరించారు.

శోభకృత్‌లో అన్నీ శుభాలే..


బొబ్బిలి రూరల్: పక్కిలో ఏరువాక నిర్వహిస్తున్న ఎమ్మెల్యే శంబంగి వెంకటచినఅప్పలనాయుడు


రామభద్రపురం: షిర్డీసాయి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు


బొబ్బిలి రూరల్: విజయపురిలో థింసా నృత్యం చేస్తున్న గిరిజనులు


బొబ్బిలి రూరల్: నారాయణప్పవలసలో సంప్రదాయ దుస్తులతో ఉపాధ్యాయులు, చిన్నారులు

తెలుగు సంవత్సరాది ఉగాదిని తెలుగు ప్రజలంతా బుధవారం ఘనంగా జరుపుకున్నారు. శోభకృత్ నామ సంవత్సరానికి ఆహ్వానం పలుకుతూ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. షడ్రుచులతో కూడిన ఉగాది పచ్చడిని అందరికీ పంచిపెట్టి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కొత్త ఏడాదిలో పంటలు సమృద్ధిగా పండాలని కోరుకుంటూ రైతులు ఏరువాక కార్యక్రమం చేపట్టారు. ఊరూరా ఆలయాల్లో పంచాంగ శ్రవణం నిర్వహించారు. రాశిఫలాలతో పాటు ఈ ఏడాది వర్షాలు అనుకూలంగా ఉంటాయని, పంటలు బాగా పండుతాయని పంచాంగ పఠనకర్తలు తెలిపారు. పక్కి గ్రామంలో ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు ఏరువాక, పంచాంగ శ్రవణం కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్


సంతకవిటి: సంతకవిటిలో పంచాంగ శ్రవణంలో గ్రామస్తులు


బొబ్బిలి: కళాభారతిలో జరిగిన ఉగాది వేడుకల్లో సంప్రదాయ వస్త్రధారణలో విద్యార్థినులు


బొబ్బిలి: ఉగాది వేడుకలను ప్రారంభిస్తున్న మున్సిపల్ మాజీ చైర్మన్ తూముల అచ్యుతవల్లి, సిద్ధా సత్యనారాయణ తదితరులు


రేగిడి: రేగిడిలో పంచాంగ పఠనం


రాజాం సిటీ: లక్ష్మీపురంలో పంచాంగ శ్రవణం


మెంటాడ: మండల కేంద్రంలోని పణుకువాని తోటలో పంచాంగ శ్రవణం


వంగర: వంగరలో పంచాంగ పఠనం చేస్తున్న పండితుడు


రాజాం: మల్లికార్జున కాలనీలో నిర్వహించిన ఉగాది వేడుకల్లో ఆకట్టుకున్న నృత్యప్రదర్శన

విద్యానికేతన్‌లో ముగ్గుల పోటీలు


ముగ్గుల పోటీ విజేతలకు బహుమతి అందిస్తున్న నిర్వాహకులు

రాజాం: పట్టణంలోని విద్యానికేతన్ పాఠశాలలో రాజాం సేవాభారతి ఆధ్వర్యంలో ఉగాది వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో పుచ్చలవీధికి చెందిన నందిని, కస్పావీధికి చెందిన దుర్గాభవానీ, తెలగావీధికి చెందిన రమాదేవి వరుసుగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు గెలుచుకున్నారు. అనంతరం రామాయణంలోని శ్లోకాల పోటీలు నిర్వహించారు. విజేతలకు డాక్టర్ వి.అప్పలనాయుడు, రెడ్‌క్రాస్ ప్రతినిధి కొత్తా సాయిప్రశాంత్‌కుమార్ చేతులమీదుగా బహుమతులు అందజేశారు. వేడుకల్లో బొద్దూరు బాలసంస్కార్ కేంద్రం చిన్నారుల నృత్యప్రదర్శన ఆకట్టుకుంది.

• రైతులకు సత్కారం


సత్కారం పొందిన రైతులతో వాసవీక్లబ్ సభ్యులు

రాజాం సిటీ: రైతులు నిత్య శ్రమజీవులని వాసవీక్లబ్ మనరాజాం–సారధి సభ్యులు అన్నారు. స్థానిక వాసవీకల్యాణ మండపంలో ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని బుధవారం 'జైకిసాన్' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రైతులను సత్కరించారు. రైతులు భగవంతుని ప్రతిస్వరూపాలని, వారి వల్లే మనందరికీ ఆహారం లభిస్తోందని, ప్రతి ఒక్కరూ రైతులను గౌరవించాలని అన్నారు. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా ఏడాది పొడవునా పంటలు పండించడం రైతులకే సాధ్యమన్నారు. అంతకుముందు చిన్నారులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. కార్యక్రమంలో వాసవీక్లబ్ సభ్యులు డాక్టర్ గ్రంథి రవికుమార్, అంబరీస్, పి.చిట్టిబాబు, నగేష్, వనిత కాంతి కిట్టి సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

25 నుంచి ఈశాన్యేశ్వర ఆలయ ప్రతిష్ట


ఎంపీపీ లక్ష్మణరావును ఉత్సవాలకు ఆహ్వానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

రామభద్రపురం: మండల కేంద్రంలోని అయ్యప్పస్వామి ఆలయ ప్రాంగణంలో దాతల సహకారంతో నూతనంగా నిర్మించిన ఈశాన్యేశ్వర స్వామి ఆలయ ప్రతిష్టామహోత్సవాలను ఈ నెల 25 నుంచి 27 వరకు నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు చొక్కాపు రామారావు, కిర్ల చంద్రశేఖర్, బంటు అప్పారావు తెలిపారు. ఉత్సవాల్లో పాల్గొనాలని కోరుతూ ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావుకు కమిటీ సభ్యులు బుధవారం ఆహ్వానం అందజేశారు. మూడు రోజుల పాటు ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఉంటాయన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో ఉత్సవాల్లో పాల్గొనాలని కోరారు.

వివాహిత అదృశ్యం

వంగర: మండలంలోని ఓనెఅగ్రహారం గ్రామానికి చెందిన వివాహిత అదృశ్యంపై ఫిర్యాదు అందినట్లు ఎస్సై బుడుమూరు లోకేశ్వరరావు తెలిపారు. ఈ నెల 21 నుంచి కనిపించడం లేదని ఆమె తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

జలం లేనిదే.. జీవం లేదు



ర్యాలీని ప్రారంభిస్తున్న సాయిప్రశాంత్‌కుమార్, తదితరులు

రాజాం సిటీ: ప్రజలు నీటి ఆవశ్యకతను తెలుసుకుని పొదుపుగా వాడుకోవాలని రాజాం రెడ్‌క్రాస్ అధ్యక్షుడు కొత్తా సాయిప్రశాంత్‌కుమార్ అన్నారు. ప్రపంచ నీటి దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఎన్‌సీసీ విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే రోజుల్లో నీటి కొరతను నివారించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. జలం లేనిదే జీవంలేదు, జలమే మన బలం, వర్షపునీటిని వడిసిపడదాం–భూగర్భ జలాన్ని కాపాడుదాం అంటూ విద్యార్థులు నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ ఆఫీసర్ బీవీ అచ్యుత్‌కుమార్, పెంకి చైతన్యకుమార్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామనవమి ఉత్సవాలు ప్రారంభం


పిరిడిలో సీతారాముల విగ్రహాల ఊరేగింపు

బొబ్బిలి రూరల్: మండలంలోని పిరిడి, ముత్తాయవలసలో శ్రీరామనవమి వేడుకలు బుధవారం నుంచి ప్రారంభమయ్యాయి. సీతారాముల విగ్రహాలను రథంపై ఊరేగించి ఉత్సవాలను ప్రారంభించారు. భక్తులు స్వామివారి రథాన్ని లాగుతూ పరవశించిపోయారు. సీతారాముల రథంపై చిన్నారులను ఊరేగించారు. ఇలా చేస్తే వారు గొప్పవారవుతారని పిరిడి గ్రామస్తుల నమ్మకం. ముత్తాయవలసలో సర్పంచ్ పిల్లా వసుంధర ఉత్సవాలను ప్రారంభించారు. ఏటా ఉగాది నుంచి శ్రీరామనవమి వరకు ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ అని గ్రామ పెద్దలు తెలిపారు.

టీకాయే శ్రీరామరక్ష


మర్రివలసలో పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేస్తున్న పశువైద్య సహాయకులు

- గాలికుంటు వ్యాధిపై అప్రమత్తత అవసరం
- నిర్లక్ష్యం చేస్తే పశువులకు ప్రాణాంతకం
- ముమ్మరంగా కొనసాగుతున్న వ్యాక్సినేషన్

రామభద్రపురం: వాతావరణ మార్పులతో పశువుల్లో సీజనల్ వ్యాధులు సంక్రమించే ప్రమాదం ఉంది. పాడిరైతులు వ్యాధి లక్షణాలను సకాలంలో గుర్తించి టీకాలు వేయించినట్లయితే పశుసంపదను కాపాడుకోవచ్చని పశువైద్యులు సూచిస్తున్నారు. పశువైద్యశాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వం పాడిపశువులకు ఉచితంగా గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేస్తోంది. డివిజన్‌లోని అన్ని పశువైద్య కేంద్రాల్లో వ్యాక్సినేషన్ ముమ్మరంగా సాగుతోంది. పాడిరైతులు తమ వద్ద ఉన్న పశువులకు తప్పకుండా టీకాలు వేయించాలని పశుసంవర్ధకశాఖ ఏడీ ఎల్.విష్ణు సూచిస్తున్నారు.

గాలికుంటు వ్యాధి లక్షణాలు

వ్యాధి సోకిన పశువుల నోటి నుంచి చొంగ కారడంతో పాటు 105 డిగ్రీల జ్వరం ఉంటుంది. నోరు, కాలిగిట్టల్లో పుళ్లు ఏర్పడతాయి. గాలి ద్వారా ఇతర పశువులకు వ్యాప్తి చెందుతుంది. వ్యాధి సోకిన పశువుల పాలు తాగడం ద్వారా దూడకు కూడా వ్యాధి సోకే ప్రమాదం ఉంది. ఈ వ్యాధి సోకిన పశువులు ఎక్కువ సేపు ఎండలో ఉండలేవు.


పశుసంవర్ధకశాఖ ఏడీ ఎల్.విష్ణు

నివారణ చర్యలు

వ్యాధి సోకిన పశువులను గుర్తించి గుంపు నుంచి వేరు చేసి విడిగా కట్టేయాలి. ఇలా చేయకపోతే ఇతర పశువులకు వ్యాధి సోకే ప్రమాదం ఉంది. వెంటనే పశువైద్యుడిని సంప్రదించి చికిత్స అందించాలి. వ్యాధి సోకక ముందు ఎఫ్ఎండీ వ్యాక్సిన్ వేయించాలి. సోకిన తర్వాత పెన్సిలిన్, యాంటీ ఇస్టమిన్, యాంటీ ఇస్టమేటరీ డ్రగ్స్ వాడుతూ నోటిలో, కాలిగిట్టల మధ్య గ్లిజరిన్‌తో శుభ్రం చేసి బోరిక్ పౌడర్ పట్టించాలి. వ్యాధి సోకక ముందే వ్యాక్సిన్ వేయించుకుని జాగ్రత్తపడాలి.

సంపద సృష్టిలో ఆదర్శం

- చెత్త సేకరణ, కంపోస్టు తయారీలో ఆదర్శంగా నిలుస్తున్న పనసవలస
- ఏటా పంచాయతీకి రూ.లక్షకు పైగా ఆదాయం


పనసలవలసలో ఆదాయాన్నిస్తున్న సంపద తయారీ కేంద్రం

రేగిడి: చెత్త నుంచి సంపదగా మార్చాలనే ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతోంది. గ్రామాల్లో ప్రతీ ఇంటి నుంచి తడి, పొడిచెత్తను సేకరించి దాన్ని సేంద్రియ ఎరువుగా మార్చి విక్రయించడం ద్వారా సేంద్రియ ఎరువుల వినియోగాన్ని ప్రోత్సహించడంతో పాటు గ్రామాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో ప్రతీ పంచాయతీలో ప్రభుత్వం చెత్త నుంచి సందప తయారీ కేంద్రాలను ఏర్పాటు చేసింది. కొన్ని చోట్ల ఈ కేంద్రాలు వినియోగంలోకి రాగా, మరికొన్ని చోట్ల వివిధ కారణాలతో అందుబాటులోకి రాలేదు. మండలంలోని పనసవలసలో ఏర్పాటు చేసిన కంపోస్టు తయారీ కేంద్రం సంపద సృష్టిలో ఆదర్శంగా నిలుస్తోంది.

రూ.లక్ష వరకు ఆదాయం

గ్రామంలోని ప్రతీ ఇంటి నుంచి క్లాప్ మిత్రలు తడి, పొడి చెత్తను క్రమం తప్పకుండా సేకరిస్తున్నారు. చెత్తను ప్రాసెసింగ్ కేంద్రానికి తరలించి తడి, పొడి చెత్తను వేరుచేసి కంపోస్టు తయారీకి వినియోగిస్తారు. తడిచెత్తకు పొడివ్యర్థాలు, వానపాములు జోడించి దాన్ని కంపోస్టుగా తయారు చేస్తున్నారు. ఈ సేంద్రియ ఎరువును దుక్కి సమయంలో పొలంలో వేసుకుని దున్నడం వల్ల భూసారం పెరుగుతుంది.


తయారీ కేంద్రంలో విక్రయానికి సిద్ధంగా సేంద్రియ ఎరువు

ఫలితంగా పంట పెరుగుదల కావాల్సిన పోషకాలు లభిస్తాయి. రసాయన ఎరువుల వినియోగం కోసం చేయాల్సిన ఖర్చు తగ్గుతుంది. ఈ కేంద్రంలో తయారు చేసిన కంపోస్టును రైతులకు విక్రయించడం ద్వారా పంచాయతీకి ఆదాయం సమకూరుతోంది. దీన్ని కేంద్రం నిర్వహణ, క్లాప్ మిత్రలకు వేతనాల కోసం ఖర్చు చేస్తున్నారు. అలాగే కేంద్రం పరిసరాల్లో సేంద్రియ ఎరువులు వినియోగించి కూరగాయలను కూడా సాగు చేస్తున్నారు.

అన్ని పంచాయతీల్లో అమలు చేస్తాం



పనసలవలసలోని కేంద్రం మాదిరిగానే మండలంలోని అన్ని పంచాయతీల్లో చెత్తసంపద కేంద్రాలు వినియోగంలోకి వచ్చేలా చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే 15 పంచాయతీల్లో వాటి నిర్మాణాలు పూర్తయ్యాయి. మిగిలిన పంచాయతీల్లో కూడా త్వరలో నిర్మాణాలు పూర్తయ్యేలా చర్యలు చేపడతాం. – జి.కాశీవిశ్వనాథరావు, ఎంపీడీఓ, రేగిడి

ప్రజల సహకారంతో..



మా పంచాయతీలో ప్రజలు చెత్త నుంచి సంపదతయారీకి సహకరిస్తున్నారు. చెత్తను గ్రామంలో ఎక్కడికక్కడ వేయకుండా క్లాప్ మిత్రులకు అందిస్తున్నారు. వారు దాన్ని సంపద కేంద్రానికి తీసుకువచ్చి కంపోస్టుగా మార్చుతున్నారు. కంపోస్టు విక్రయించడం ద్వారా పంచాయతీకి లక్ష రూపాయల వరకు ఆదాయం వచ్చింది.

– గేదెల గోవిందనాయుడు, సర్పంచ్, పనసలవలస